# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-01-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ మైలురాయి సాధించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **దక్షిణ భారతదేశంలో డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవిస్తోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.**

3. **ఏపీఎస్ఆర్‌టిసి కి గవర్నెన్స్ నౌ- ఆరవ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డు రావడం గర్వకారణమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.**

4. **సంక్రాంతి పండగ సెలవుల అనంతరం ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ మళ్ళింపు గమనించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ మైలురాయి సాధించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 2024 అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానాన్ని ప్రారంభించినప్పుడు.. ఆంధ్రప్రదేశ్‌ని దేశ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే స్పష్టమైన సంకల్పాన్ని వ్యక్తం చేసినట్లు ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. ఈరోజు కాకినాడలో AM గ్రీన్ సంస్థ చేపడుతున్న 1.5 MTPA గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ఏర్పాటు పనులు ప్రారంభించనుండటం మైలురాయిగా నిలుస్తోందని పేర్కొన్నారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కాకినాడ జిల్లాలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా కాకినాడ సమీపంలో ఎఎం గ్రీన్ అమోనియా ప్రైవేటు లిమిటెడ్ ప్లాంటు నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తో కలిని ఆయన శంకుస్థాపన చేస్తారు.

--------------------------

దక్షిణ భారతదేశంలో డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవిస్తోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. దిల్లీలో నిర్వహించిన 'స్టార్టప్ ఇండియా' పదవ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన

నిన్న మాట్లాడారు. డీప్ టెక్నాలజీ, ఏఐ స్టార్టప్‌లకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కేంద్రాలుగా మారాయని అన్నారు. స్టార్టప్ విప్లవం దేశంలో విస్తరించిందని, దాదాపు రెండు లక్షల అంకుర సంస్థలు వివిధ రంగాల్లో ప్రస్తుతం పనిచేస్తున్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పేర్కొంటూ...

వాయిస్...33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కు గవర్నెన్స్ నౌ- ఆరోవ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డు రావడం గర్వకారణమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విజయం ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది అందరూ ప్రజలకు అంకితభావంతో అందిస్తున్న సేవలకు నిదర్శనమని అభివర్ణించారు. ప్రధాన బస్టాప్‌లలో అమలు చేసిన ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రయాణికులకు రియల్- టైమ్, స్పష్టమైన సమాచారం అందుతోందని తెలిపారు. ముందస్తు సమాచారం అందించడం వల్ల సేవల నాణ్యత గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు నుంచి రెండు రోజుల పాటు పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్ లోని మాల్దా జిల్లా కేంద్రానికి చేరుకోనున్న ఆయన 3 వేల 250 కోట్ల రూపాయల విలువైన పలు రైలు, రహదారి ప్రాజెక్టులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. మల్దా టౌన్ రైల్వే స్టేషన్ ను సందర్శించి, హౌరా -- గౌహతిల మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలును వర్చువల్ గా ప్రారంభిస్తారు. ఈ సాయంత్రం అస్సాం రాష్ట్రంలోని గౌహతికి చేరుకుని.. సరుసజాయ్ స్టేడియంలో నిర్వహించే సంప్రదాయ బోడో సాంస్కృతిక కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. రేపు అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వివిధ అభివృద్ధి ప్రాజక్టులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారు.

---------------------------

సంక్రాంతి పండగ సెలవుల అనంతరం ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనదారులకు పోలీసు అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు నుంచి వెళ్లే వాహనాలు కృష్ణాజిల్లాలోని చిన్న అవుటపల్లి వద్ద విజయవాడ వెస్ట్ బైపాస్ మీదగా హైదరాబాద్ కు వెళ్లాలని తెలిపారు. నెల్లూరు, ఒంగోలు నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు వెళ్లే వాహనాలు గుంటూరు కాజ, చినకాకాని జంక్షన్ నుంచి గొల్లపూడి మీదగా వెళ్లాలని సూచించారు.

---------------------------

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు ఉన్నాయని తిరుపతి జిల్లాకు చెందిన రైతులు తెలియజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సేంద్రీయ ఎరువులతో సహజ వ్యవసాయం చేస్తూ ఒకవైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ.. ఆర్థికంగా లబ్ధి పొందుతున్నామని చెబుతున్నారు. రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ఎరువులు, రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంపైనే ప్రత్యేక దృష్టి సారించామని జిల్లాకు చెందిన జలగం శ్యామ్ తెలియజేస్తూ...

..వాయిస్...25 సెకన్లు

----------------------------

గుంటూరులో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సరస్ మేళాలో దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలు, హస్తకళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మొత్తం 300 స్టాళ్లను ఏర్పాటు చేయగా, వాటిలో 60కి పైగా స్టాళ్లు ఇతర రాష్ట్రాల మహిళల ఏర్పాటు చేశారు. సరస్ మేళాలో పాల్గొనడానికి వస్తున్న మహిళలకు అన్ని ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ విధంగా సరస్ మేళా మహిళలను పరిశ్రమ వ్యవస్థాపకులుగా మార్చేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

----------------------------

ఐసిసి పురుషుల అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా జింబాబ్వేలోని బులవాయోలో ఉన్న క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో భారత్, బంగ్లాదేశ్ జట్లు తలపడుతున్నాయి. ఇందులో భాగంగా మొదట టాస్ గెలిచిన బంగ్లాదేశ్ బౌలింగ్ ఎంచుకుంది.

----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేశారు.

----------------------------

పశ్చిమగోదావరి జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో కూడా స్థిరమైన ఆదాయ వనరుగా పశుసంవర్ధక రంగం ఉందని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం లక్షా 78 వేల 137 గేదెలు, 45 వేల 538 ఆవులు, 38,804 గొర్రెలు, 22,765 మేకలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ సూచనల మేరకు 2025 సంవత్సరంలో పశువుల ఆరోగ్య రక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నియంత్రణ, పశుపోషణ ఖర్చుల తగ్గింపు, శాస్త్రీయ పశుపోషణపై అవగాహన పెంచే లక్ష్యంతో జిల్లాలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు.

----------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు తణుకు ప్రాంతాల్లో రైతులు దాళ్వా వరి నాట్లు నాటడం పూర్తి అయిందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలో రెండు లక్షల 25వేల ఎకరాలకు లక్ష ఎకరాలకు పైగా వరి నాట్లు వేసినట్లు చెప్పారు. మరో రెండు మూడు రోజుల్లో నూరు శాతం పూర్తి అవుతాయని చెప్పారు. రైతులకు ఎరువులు పురుగుమందులు వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగు చేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

======================